# ముసలమ్మ మరణం

చీకట్లో మొండిగోడవారన మెట్లదగ్గిర అలికిడికి, వస్తున్న వాడ్నల్లా ఆగి-

'ఎవరబ్బా! అరుగుమీద....'

'నే...న...్రా' మూలుగుతూ కదుల్తోంది. ఎవరో మూటకట్టి మా అరుగుమీద పారేసిన కుళ్లు గుమ్మడిపండు.

'హెవ్వా! నువ్వా బామ్మా! ఎట్లా వచ్చావ్?'

ఎప్పుడు వచ్చి కూర్చుందో, ఎట్లా దారి తెలుసుకుని వచ్చిందో!

'ఆ రష్యావాడు ఇక్కడ దింపేశాదురా బాబూ!'

'ఏ' రష్యావాడూ? 'ఓహెవ్వా! రిక్షావాడా? లే బామ్మా! ఇట్లా అరుగుమీద, కూర్చున్నావేం? లోపలికి పోదాంపా-'

'లేవలేనురా అబ్బాయి....'

కూచుంటే లేవలేదు. లేస్తే కూచోలేదు. చెంబు, మూటా పుచ్చుకొని కఱ్ఱచేతికిచ్చి నిల్పోపెట్టాను. గొణుక్కుంటూ నన్ను చూసి.

'నువ్వు మాచెప్పకొడుకువిగదూ!' అని కళ్ళొత్తుగుంటూ 'అయ్యో నా రాతా-నా కంటే చిన్నవాళ్ళంతా పోయా్రా! కాని నాకు మాత్రం చావు రాకుండా ఉంది."

నాకీ బామ్మ హస్తవాసి ఒకందుకు గుర్తు. ఒక మాటు ఆవిడ వెలక్కాయ పచ్చడి చేసింది. దానికోసం దేవదానవులు పోట్లాడుకుంటే ఆశ్చర్యపడ్నక్కర్లేదు. పులిహోరగాని పులుసుగాని చేస్తే దాన్ని అట్టేబెట్టుకుంటే రోజు రోజుకీ దాని రుచి ఇంతకు రెండింతలవుతుంది. పరుస వేది తగిల్తే అంతా బంగారుమయినట్లు ఈవిడ చేయి తగిల్తే ఏ పదార్థమైనా అమృత తుల్యమవుతుంది. పిల్లలకు యేదన్నా కాస్త నలత కనుపిస్తే ఆవిడ పోపుల పెట్టెను ఘెసుగా వాడేసేది. అదంతా జ్ఞాపకమొచ్చి.

'బామ్మా నువ్వు చేస్తే వెలక్కాయ పచ్చడి తినాలని వుంది.' అన్నా.

'అయ్యో నే చచ్చిపోనూ...యింకా వెలక్కాయ పచ్చడి గుర్తుందిబాబూ! కళ్లుకనబడవు నాయనా! చేతుల్లో శక్తి లేదురా తండ్రీ! నా వంటెవరిక్కావాలిరా...దిక్కుమాలి వంట...!

ఆయెముకల పోగుని అభిమానించి యెత్తుకుని మెట్లన్నీ యెక్కి మేడమీదకు తీసుకుకెళ్ళాను.

'నువ్వెట్లా వచ్చావ్ పెద్దమ్మా' అని నిలువు గుడ్లేసుకుని దారికడ్డంగా వచ్చి నిలబడిపోయింది మా పిన్ని. మా మేనత్త పళ్ళు పటపటా కొరకుతూ, స్నానాల గదికేసి నన్ను మళ్ళించి 'ఏవమ్మోవ్' పెద్దదానివి నీకు మే చేయవలసిన వాళ్ళమే-కాదన్ను. నీకిక్కడేం సుఖం-కదలలేవు. ఐనవాళ్ళంతా ఉంటూండగా తగదునమ్మా అంటూ మధ్య పూసుగుని రావటానికి మే మెవళ్ళం?' అంది.

'ఎ...వ..మా...ట్లా...డే...ది? ర-త్తా-లూ-' చేతుల్లోబాత్‌రూం గచ్చుతేమగా వుండటాన్ని గమనిస్తూ 'ఏవేఁ నీ మొగుడిప్పుడు వూళ్ళో గొడవల జోలికి పోకుండా తిన్నగా ఉంటున్నాడూ? అబ్బాయ్ నేల చల్లగా వుందేం చెప్మా' నేను పోయి స్టోరు రూం లోంచి గోనెసంచులు నేలమీద పర్చి ముసలమ్మను కూర్చోబెట్టాను.

'సడే...నీ కెంత సొహంతరంరా?' అని విసిరింది మా మేనత్త. నేనేదో ఘనకార్యం చేశాననుకున్నా. నా ఉద్దేశం నంత చలితో చీకట్లో ఆ ముసలమ్మ అరుగుమీద బాధపడ్డం భావ్యంకాదని. పైగా ఆవిడేం పరాయిమనిషా-మా నాన్నకు స్వయాన మేనత్తే.

ఇంట్లోని ఆడవాళ్ళంతా నన్ను లోపలికి పిల్చి-

'చావుకి సిద్ధంగావున్న ఆ ముండని మేడమీదకు తీసుగొస్తావ్? ఇంట్లో ఎవళ్ళనీ అడక్కుండా చెయ్యకుండా-ఒరే! నీ కిల్లాంటి బుద్ధులుపుడుతున్నాయే?'

'అది చూస్తే తీసుగు తీసుగు ఛస్తోంది. రోగిష్టిదానికి చాకిరీ అంటేమాటలా? ఇంటినిండా పిల్లలూ-చిన్నసంసారమూ మనది. అంత జ్ఞానం లేకపోతే ఎట్లా....

'మన కొంపలోకి తెచ్చాక దానికి వైద్యం, డాక్టర్లూ-ఛస్తేరేపు బోల్డు ఖర్చు ఇవన్నీ నీకేం తెలుసు?'

మనవేంతిన్నాం మనకేం పెట్టింది? ఎవరు తిన్నారో వాళ్ళే పడతారు అవస్థలు.'

'లేనిపోని తద్దినాన్నెందుకురా యింట్లోకి ఈడ్చుకొచ్చావ్?'

'ఊరుకోండర్రా!!! పాపం బామ్మకు వినిపిస్తే .... నేను వెర్రిమొహం వేశాను.

ఏం వినిపిస్తే?'

'నాన్నరానీ-'

బంధుత్వాలు క్షణికమనీ, మనుష్యుల విలవలు ఉన్నట్లుండి గమ్మత్తుగా తారుమారవుతాయని నా కప్పట్లో యేం తెలుసు? ఆవిడ ఒంట్లో ఓపిక వున్నంతకాలం అడ్డమైన చాకిరీ చేయించుకుని అంతా లొట్టలేస్తూ ఆప్యాయంగా తిన్నవాళ్ళే! మరి అంతా

మహమ్మారిని చూసి ఝడుసుకున్నట్లు మాట్లాడ్తారేం? నాన్న వచ్చాడు. వస్తూనే కొంపకు అగ్గి ముట్టుకుందని నా మీద విరుచుకుపడ్డాడు.

'ఆ వుచ్చలూ పీతిళ్ళూ నే నెత్తి పోస్తాను. మీ కెవ్వరికీ యే శ్రమాఒద్దు' అని అరిచాను.

ఐతే చదువూ సంధ్యా లేకుండా ఈ ఆడంగి రేకువనులన్నీ చేసస్తూ కూర్చుంటావన్నమాట?' అంది పిన్ని యెగసనదోస్తూ.

'ఎవడ్రా నీ బాబు? ఐనవాళ్ళకూ కానివాళ్ళకూ ఈ వెట్టి చాకిరీ అంతా చెయ్యడానికి. ఎవడచ్చుకున్నాడు? ఛో. ముందీ కొంపలోంచి ఆ ఝుండను బైటకు తీసుగుపోతావా లేక జంధ్యం తెంపుకుని నేనీకొంపలోంచి పైకి పోయేదా?'

నాన్నకు శివమెత్తి పోయింది.

'ఇంతరాత్రప్పుడ్డా-చలిలోనా? ఎక్కడ దిగబెట్టిరాను?'

'ఏట్లో....కృష్ణలంకలో-'అని నాన్న చిందులు తొక్కుతూ బాత్‌రూం దగ్గరకెళ్ళి-

'నీ కూతురు అత్తారుండగా మా మీదకొచ్చి పడ్డావేమే దయ్యమా? నీ మొగుడి ఆస్థి చుట్టుకున్నారుగా? ఇంకేం వాళ్ళ గుమ్మంలో చావటం న్యాయం. పద! పద!.'

"ఇంకెక్కడి కూతురత్తారురా నాయనా? దాని ఆయుస్సూ మీ ఆయుస్సూ పోసుగుని నే నెందుకు బతికున్నాన్రా భగవంతుడా? అల్లుడా అని ఏ మొహం పెట్టుగుని పోన్రా తండ్రీ!" అని గోలు గోలున రాగాలు పెట్టసాగింది.

"నువ్వేం అనుకోకు పెద్దమ్మా? వాళ్లకూ మాకూ రాకపోకల్లేవా. నువ్విక్కడ ఉండటం ఏం బాగుండదు. మళ్ళీ నీ కానక యేం చెయ్యాలి సొచ్చినా యెవళ్ళకు విధాయకమో వాళ్ళ పంచకు పెందరాళే చేరుకోవటం సబబు. తిన్నవాళ్ళు చెయ్యకేం చేస్తారు? లోకం చూస్తూ ఊరుకుంటుందా? చెప్పుచ్చు కొడతారు. ఆనక మేమంతా లేమూ?" అంది పిన్ని సముదాయిస్తూ.

"రిక్షా మెట్లదగ్గర ఆపుచేయించాను" అంది మా మేనత్త రొప్పుకుంటూ మేడమెట్లన్నీ యెక్కివచ్చి.

ఇక చేసేదిలేక నేను మా నాన్నా ముసలమ్మను ఈడ్చుకుంటూ వీధిలోకి లాక్కువచ్చాం, కర్రా, చెంబూ, మూటా రిక్షాలో సర్దుతూ "కూర్చో బామ్మా!" అన్నా.

పడమటి దిక్కున కొండంత మేఘం తరుముకొస్తోంది. రివ్వున చలిగాలి వీచింది. రిక్షా కదుల్తూంటే చినుకులు దబదబా పడ్డం ఆరంభించాయి. వజవజా వణికిపోతూ నేను వెనకాతలే సైకిల్ తొక్కుకుంటూ లాంతరు స్తంభాల్ని లెక్క పెడ్తున్నాను. ముసలమ్మ కుంయ్ కంయ్ మనటంలేదు. నాకు మనసంతా విరిగి గుండె నీరయిపోయింది.

పీడవదిలించుకున్నామని తృప్తి పడుతున్నారే వీరంతా-ఎల్లకాలమూ రోజులిల్లాగే గడుస్తాయనుకుంటున్నారా?

వీళ్ళకెవరికీ ముసలితనం రాదూ?

ఈ ఆస్తి పాస్తులు గౌరవ మర్యాదలు కలకాలం వుండేవా?

పురుళ్లకనీ, పుణ్యాలకనీ, కార్యం కరామత్తుల్లో ఒంటినిండా చాకిరీ చేసి, గుప్పెడు మెతుకుల్తో, ఒక సైను పంచె ఒక ఇత్తడి చెంబుతో జీవితాన్ని కృష్ణారామా అంటూ కాలక్షేపం చేసిన మనిషి! శక్తులుడిగి కాలం ముంచుకొచ్చి మూలపడగానే పాత చెప్పుకన్నా హీనమై పోవాలా?

పనికిరానంత మాత్రాన ముసలమ్మ మనిషి కాకుండా పోయిందా?

ఆ మేడలు రెండూ ఇంకా ముసలమ్మ పేరనేఉంటే, కుక్కల్లా ఎగబడే బంధువుల, చావుబతుకుల్లోవున్న ఆ ప్రాణిని యింత హింస పెట్టాలా, చలిలో, వానలో, చీకట్లో.

గాంధీ నగరం నుంచి బయలుదేరిన రిక్షా బెజవాడ పాత టవును దుర్గకొండ వీధికి చేరుకునేసరికి వర్షం ఎత్తిపోసింది. రిక్షావాలా తడిశాడు నేను తడిశాను. ముసలమ్మ సరేసరి–చావలేదు.

అల్లుడిగారింటిముందు రిక్షా ఆపి తలుపులు దబదబా బాదాను.

"ఎవరువారు. వస్తూంటే..." అని విసుగ్గా అరుపు. రిక్షాలోంచి దింపుతూంటే ముసలమ్మ "కూతురా, కూతురా?" అంటూ ఏకగోల! తలుపులు పూర్తిగా తెరవబడకుండానే "బామ్మగారొచ్చారు" అంటూ నేనూ రిక్షావాలా కలిసి ముసలమ్మగారిని సునాయాసంగా లోపలికి నెట్టి, పిలుస్తున్నా వెనక్కి తిరక్కుండా చపాయించేశాం. తరువాత ఆ చచ్చిపోయిన కూతురి అత్తారు వియ్యపురాలిని ఉచితరీతిని సత్కరించారో, ఆ మెట్లమీదే వానలో రాత్రల్లా వదిలేశారో, ఆ ప్రాణిపట్ల ఏ అజ్ఞాత హృదయంలోనైనా రవ్వంత వదిలేశారో, ఆ ప్రాణిపట్ల ఏ అజ్ఞాత హృదయంలోనైనా రవ్వంత సానుభూతి దయకలిగిందో లేదో భగవంతుడికి మాత్రమే తెలుసు. అతడుకూడా ఈ విరిగిన చెట్టుని తప్పించుకునే తన రథాన్ని తోలాడు. మృత్యువు రమ్మని పిలవలేదు. చిత్రగుప్తుడు పాపపుణ్యాల లెక్కలుకట్టి హుకుం జారీ చెయ్యటానికి కూడా జాప్యం చేస్తూ వచ్చాడు. యముని మహిషపులోహఘంటలు విందామని కూర్చున్న ముసలమ్మకు పిలుపు మాత్రం రాకుండా వుంది.

చావుని గురించి అదేదో భీభత్సంగా ఊహించుకోవడం తప్పించి మనుష్యులు దాని కోసం తాపత్రయ పడతారనీ, ఆ ప్రయత్నాలలోవున్న వారిని తప్పించుకు తిరగాలని గ్రహించేపాటి వయస్సుకూడా కాదునాది.

తరువాత నేను కర్ణాకర్ణిగా విన్నది, ఆ మాజీ అల్లుడుకూడా ముసలమ్మను ఆ మర్నాడే రైలుస్టేషనుకు తీసుకెళ్ళి బందరు టిక్కెట్టు కొని ఇచ్చి రైల్లో కూర్చోబెట్టి పంపించేశాట్ట! ఒక్కర్తీ ఆవిడ రైలు ఎట్లా దిగిందో, పుణ్యాత్ములెవరు సాయపడ్డారో ఊళ్లో ధర్మాసుపత్రిలో చేర్పించేశార్ట. ఇక ఈవిడ అధ్యాయం బందర్లో ముగిసేదే తిరిగిరాదనుకున్నాం. కాని–ఆశ్చర్యం! అక్కడ పరాయి ఊళ్ళో ప్రాణం వదల్టానికి మన సొప్పలేదట. స్వగ్రామం, పవిత్రమైన కృష్ణానదీ తీరం–పోతే ప్రాణాలు ఇక్కడ్నే పోవాలిట. మళ్ళీ ఎక్కేగుమ్మం దిగే

గుమ్మం-ఐనవాళ్ళ కొంపలన్నీ చుట్టాక, అందరూ ఛీ! ఛీ! అన్నాక ఆవిడకేమనిపించిందో, పాత వూళ్ళో మునుపు పునిస్త్రీగా మొగుడి హయాంలో అర్ధణాకాసంత బొట్టూ, ఒంటెడు నగలూ మనిషి నిండుగా మెట్టిన సొంత ఇంటి అరుగున పంచకు చేరింది.

"ఎవరో ముసలమ్మ పాపం అరుగుమీద కూర్చుంది" అనుకున్నారంతా.

"ఎవర్నో కానర్రో-ఇది నా మొగుడి ఆస్తి. ఈ అరుగు నాదే నర్రో!!!" అనుకుంది ముసలమ్మ.

పగలంతా సూర్యుడి ప్రతాపం మూలనున్న ముసలమ్మమీదే-అరుగుమీద పెనం మీది అట్టులా మాడసాగింది. ఇరుగూ పొరుగూ మర్యాదస్తులూ, రోడ్డుమీద ఆడుకునే పిల్లలూ, కూరలవాళ్లూ, పాలూ పెరుగూ అమ్ముకునేవాళ్ళూ, రాత్రిళ్ళు కుక్కలూ, పందులూ, ఎండకు ఎండ, వానకు వానా, తడిసి చీకి చీకి పెంటపోగులా మూడురోజులు కుళ్ళింది. కాని ప్రాణాలు మాత్రం ఆకాయాన్ని వదలిపోవటంలేదు.

"అరటి పండు తినాలనుంది పెట్టరూ?" అంటూ దారినపోయే అర్జంటు పనుల ఆసామీలని అడుక్కునేది. హడావిడిలో చూసీ చూడకుండా కాసులు అర్ధణాలూ పారేసే పుణ్యాత్ములు, కాస్త దయ గలిగి ఇత్తడి చెంబులోకి నీళ్ళు ఒంపే ధర్మాత్ములూ...

ఎంత దిక్కుమాలిన చావు రాసిపెట్టుంది ఈ ముసలమ్మకనుకున్నారు.

కాని వాళ్ళకేం తెలుసు?

ఈ ముసలమ్మ ఒకప్పుడు పట్టు బనారసు చీరలు కట్టుకుని పసుపూ కుంకుమా మెత్తుకుని, కూతుళ్ళూ, అల్లుళ్లూ, నేనూ నా వారూ అంటూ హెూషుగా బ్రతికేదని-రక్తమాంసాలు, ఎముకలూ శిధిలమయ్యే దాకా అయినవాళ్లకీ కానివాళ్ళకీ అడ్డమైన చాకిరీ చేసేదనీ-

ఆస్తి పాస్తుల్నీ, వయస్సునీ శాశ్వతమని నమ్ముకునే లోకానికి బరువైన బామ్మ మృత్యువుని అడిగింది-

"నీ సుఖం నాకు కాస్త పంచియివ్వరాదా" అని.

బ్రాహ్మణ వితంతువు కాలంచేస్తే పాడెకట్టి మోసుకుపోయేందుకు కూడా ఎల్లాటి ఏర్పాట్లు జరగలేదు. తెల్లవారు ఝాముననగా ముసలమ్మ గుటుక్కుమంటే మున్సిపాలిటీ వారికి కబురుచేస్తే పదకొండు గంటలకి ఎద్దుబండీ, యిద్దరు వెట్టివాళ్లూ వచ్చి ఆ జితించిన కోర్కెల గూడుని కృష్ణలంకవైపు లాక్కెళ్లారు.

అరుగుమీద ఫినాయలుపోసి కడిగారు.

సాయంత్రం చీకటి పడ్డాక పిల్లలు ఆ అరుగువైపు ఆడుకోవటానికి రావటం మానేశారు.

అన్నట్లు మున్సిపాలిటీ చావు బ్రతుకుల రిజిస్ట్రారువారి ఉద్యోగులకి కబురు చెప్పేవాళ్ళు లేరు. ఎవరీ ముసలమ్మ పాపమని నలుగురూ అడిగితే, శివ శివా! మాకు తెలీదంటే మాకు తెలీదన్నారంతా!